# 41

# దేవుని సర్వశ్రేష్ఠత

## (యెషయా 44)

దీనికి ముందటి అధ్యాయంలో బబులోను దేశము నాశనమగుననియు, ఇశ్రాయేలు పాపము చేసినదనియు దేవుడు ప్రకటించిన విషయాన్ని చూశాము. ప్రజలపై దీవెనలు గతంలో కుమ్మరింపబడినట్లుగానే ఇప్పుడును కుమ్మరింపబడునని ఆయన తన సేవకుడైన యాకోబునకు అభయమిచ్చుచున్న విషయాన్ని 44వ అధ్యాయంలో చూడగలము (1–5 వచనాలు). ఆయన మాత్రమే వారి రాజును విమోచకుడనై ఉండెనని ఆయన వారికి గుర్తు చేయుచున్నాడు (6–8 వచనాలు), దీని తరువాత విగ్రహారాధన గూర్చి ఇవ్వబడిన కటువైన గద్దింపు కనబడును (9–20 వచనాలు), పశ్చాత్తాపపడువారికి అనుగ్రహింపబడు క్షమాపణ మరియు విమోచన విషయమైన వాగ్దానము ఇవ్వబడియున్నది (21–23 వచనాలు), మరియు దేవుని ప్రజలను బబులోను చెరనుండి కోరెషు విడుదల చేయునను ఒక ప్రకటనతో ముగియుచున్నది (24–28 వచనాలు).

### ఇశ్రాయేలు కొరకైన దేవుని దీవెనలు (44:1–5)

ఈ విభాగములో నాలుగు ప్రధాన ఉద్ఘాటనలున్నవి. మొదటిది – ఇశ్రాయేలీయులను దేవుడు ఏర్పరచుకొన్నాడు (1, 2 వచనాలు), రెండవది – వారిపై దేవుని ఆత్మ మెండుగా కుమ్మరింపబడును (3 వచనం), మూడవది – అసంఖ్యాక సంతతి కలుగును (4 వచనం), మరియు చివరిది – దేవునికి చెందియుండుటలో గల దీవెన (5 వచనం).

> అయినను నా సేవకుడనగు యాకోబూ, నేను
> ఏర్పరచుకొనిన ఇశ్రాయేలూ, వినుము
> నిన్ను సృష్టించి గర్భములో నిన్ను నిర్మించి నీకు
> సహాయము చేయువాడైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
> –నా సేవకుడవగు యాకోబూ, నేను ఏర్పరచుకొనిన
> యెషూరూనూ, భయపడకుము.
> నేను దప్పిగలవానిమీద నీళ్లను
> ఎండిన భూమిమీద ప్రవాహజలములను కుమ్మరించెదను
> నీ సంతతిమీద నా ఆత్మను కుమ్మరించెదను
> నీకు పుట్టినవారిని నేనాశీర్వదించెదను.
> నీటికాలువలయొద్ద నాటబడిన నిరవంజిచెట్లు గడ్డిలో
> ఎదుగునట్లు వారు ఎదుగుదురు.
> ఒకడు – నేను యెహోవావాడననును, మరియొకడు
> యాకోబు పేరు చెప్పుకొనును,
> మరియొకడు యెహోవావాడనని తన చేతితో వ్రాసి
> ఇశ్రాయేలను మారుపేరు పెట్టుకొనును.

"నా సేవకుడగు ... నేను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలూ" (1 వచనం) అని చెప్పుట ద్వారా, ఆయన వారికి చేసిన విషయములనుబట్టి ఆయన ఒక జనాంగమును "ఏర్పరచుకొన్నాడు" అని దేవుడు సూచించుచుండెను. "ఏర్పరచుకొనిన" (*bachar*) అను పదము ముగించబడిన కార్యమును సూచించుచూ, అద్యతన (పరిపూర్ణ) భూతకాలములో ఉన్నది. ఏర్పరచుకొనబడినందునుబట్టి అణకువ మరియు భక్తి గల గౌరవము ద్వారా అందుకు సరైన ప్రతిస్పందన చూపించుట అగత్యమని బైబిలు విపులంగా విశదీకరించుచున్నది. దురదృష్టవశాత్తు, దేవుని యెడల ఇశ్రాయేలు ఎల్లప్పుడు ఇట్టి ప్రతిస్పందనను చూపించలేదు.

"నిన్ను సృజించినవాడు మరియు నిన్ను నిర్మించినవాడగు యెహోవా" అని (2 వచనం) దేవుడు తననుతాను సూచించుకొనుచున్నాడు. "సృజించినవాడు" మరియు "నిర్మించినవాడు" అను ఈ రెండు పదములు హెబ్రీ భాషలో దేవుడు తన ప్రజలతో కలిగియున్న మార్పునొందని సంబంధమును సూచించుచున్న అసమాపక క్రియలై యున్నవి.[1] ఇశ్రాయేలు ప్రజలు ఆయనను విసర్జింపవచ్చును, కానీ ఆయన వారిని ఎన్నడునూ విసర్జించడు. "యెషూరూను" అను పేరు ఇశ్రాయేలు విషయములో మాత్రమే నాలుగు వాక్యభాగములలో (ఇక్కడ మరియు ద్వితీయోపదేశకాండము 32:15; 33:5, 26లో) వాడబడిన ఒక సరైన సంజ్ఞావాచక నామమైయున్నది. "న్యాయబద్ధమైన ప్రవర్తనగల" అనునది దీని మూల పదము యొక్క అర్థమైయున్నది. అది ఇక్కడ, "చట్టమును పాటించువారు" లేక "న్యాయమును కాపాడువారు అను భావమును కనుపర్చవచ్చును."[2] "ఈ బిరుదు దాని అంతర్గత భావమును కనుపర్చుచున్న ప్రకారము దేవుని కృప ద్వారా ఇశ్రాయేలు ఏమైయుండగలదో అట్టి గౌరవమును సూచించుచున్న బిరుదై యున్నది" అని Clyde M. Woods చెప్పాడు.[3]

"నీళ్లు," "ప్రవాహజలములు," "నా ఆత్మ" మరియు "నీ సంతతి మీద దీవెనలు" మొదలైన మాటలను ఉపయోగించుచు, ఆయన తన ప్రజల గూర్చి తగు శ్రద్ధవహించునని దేవుడు వాగ్దానంచేశాడు (3, 4 వచనాలు). నీళ్లు మరియు ప్రవాహ జలములు రమణీయమైన ప్రకృతి దృశ్యమును రసవంతముగా సజీవముచేయునట్లుగానే, ప్రజల సంతానముపై క్రుమ్మరింపబడు దేవుని ఆత్మ వారిలో ఆధ్యాత్మిక జీవమును కలిగించును.[4] "ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి" అని యేసు తన శిష్యులతో చెప్పాడు (యోహాను 6:63).

దేవుని వైపు తిరుగుట ఒక సామూహిక ఉద్యమము కాదు, కానీ "ఒకడు," "మరియొకడు," "యింకొకడు" ఆయన యెడల చూపించు వ్యక్తిగత ప్రతిస్పందనయై యున్నది (5 వచనం). ప్రజలు దేవుని యెడల కలిగియున్న స్వామిభక్తిని ఎవరికి వారు స్వేచ్ఛగా ప్రకటించుకొనవచ్చును.

## దేవుని స్వయంవర్ణన (44:6–8)

ఈ వచనములు దేవుని నిరాపేక్షణీయమైన స్వాధికార ఘోషణల గూర్చి ఒక సూటియైన ప్రకటన చేయుచు దేవుడు తన ప్రజలకు అభయము నిచ్చుచుండగా దానిలో గల దైవికమైన చొరవను ప్రదర్శించుచున్నవి. ఈ వచనముల ద్వారా, ఒకే ఒక్క దేవుడున్నాడని మనము గమనించుచున్నాము, గ్రహించుచున్నాము; ఈ నమ్మకమే "దేవుడొక్కడే అను సిద్ధాంతము"

అని పిలువబడుచున్నది.

ఇశ్రాయేలీయుల రాజైన యెహోవా
వారి విమోచకుడైన సైన్యములకధిపతియగు యెహోవా
ఈలాగు సెలవిచ్చుచున్నాడు
నేను మొదటివాడను కడపటివాడను
నేను తప్ప ఏ దేవుడును లేడు.
ఆదిలోనున్న జనమును నియమించినది మొదలుకొని
నేను తెలియజేయుచు వచ్చినట్లు తెలియజేయగలవాడెవడు?
అట్టివాడెక్కడైన నుండినయెడల నాకు తెలియజెప్పవలెను
ఆ సంగతి నాకు ప్రచురింపవలెను
అట్టివారు భవిష్యద్విషయమును రాబోవు సంగతులను
తెలియజెప్పువారై యుండవలెను.
మీరు వెరవకుడి భయపడకుడి
పూర్వకాలమునుండి నేను నీకు ఆ సంగతి వినిపించి
తెలియజేయలేదా?
మీరే నాకు సాక్షులు, నేను తప్ప వేరొక దేవుడున్నాడా?
నేను తప్ప ఆశ్రయ దుర్గమేదియు లేదు,
ఉన్నట్టు నే నెరుగను.

6వ వచనం ఇశ్రాయేలు దేవుడు చేయుచున్న ఎంత గొప్ప ఆశ్చర్యకరమైన ఘోషణలతో నిండియున్నది కదా: "యెహోవా," "రాజు," "విమోచకుడు," "సైన్యములకధిపతియగు యెహోవా," "మొదటివాడును కడపటివాడను," "నేను తప్ప ఏ దేవుడును లేడు" అను ప్రకటన దేవునికిని, మిగిలిన అధ్యాయమంతటిలో ప్రస్తావింపబడు విగ్రహములకును గల తారతమ్యమును గూర్చి యోచించుటకు మార్గమును సరాళము చేయుచున్నది.

7వ వచనంలో గల సవాలు అబద్ధ దేవతలకును వాటి ప్రవక్తలకును విసరబడినది. ప్రవచించుటకు వాటికి సామర్థ్యము కలదనియు అవి పలికిన ప్రవచనములు నెరవేరినవనియు చెప్పుటకు నిదర్శనమును ప్రదర్శించుమని అట్టి సవాలు చేయబడినది, అయితే అవి ఓటమి పాలైనవి! దేవుడు మాత్రమే భవిష్యత్తును, సంభవింపనైయున్న సంగతులను ముందుగానే తెలియజెప్పగలదు.

దేవుడు గతములో వారి పక్షాన చేసిన కార్యములనుబట్టి ప్రజలు దేవునియందు నమ్మకముంచవలెనని వారికి పిలుపు ఇవ్వబడినది (8 వచనం). ఆయన వారికి "ఆశ్రయదుర్గమై" యుండెను (17:10).

## విగ్రహారాధన గూర్చి దేవుని గద్దింపు (44:9-20)

తరువాతి మూడు పేరాగ్రాపులు విగ్రహారాధన కూడదని బైబిలు యందంతటను ఇవ్వబడిన కటువైన గద్దింపులలో ఒక దానిని చక్కగా వర్ణించుచున్నది. దేవుడు విగ్రహారాధనను ఎన్నడునూ సహించలేదు (నిర్గమకాండము 20:3-5 చూడుము). యిర్మీయా కూడ ఒక శతాబ్దము కంటే ఎక్కువ కాలము తరువాత చేసిన తన ప్రవచనములో ఇదే అంశమును గూర్చి ప్రస్తావించాడు (యిర్మీయా 10:1-16). ఇదేవిధంగా, నోరు విప్పి మాట్లాడలేని మరియు ఊపిరిలేని విగ్రహములను పూజించుట తగదని హబక్కూకు కూడ దేశ బహిష్కరణము

తరువాత తిరిగివచ్చినప్పుడు ప్రవచించాడు (హబక్కూకు 2:18–20).

### విగ్రహములను చేయువాడు మానవుడే! (44:9–11)

> విగ్రహమును నిర్మించువారందరు మాయవంటివారు వారికిష్టమైన విగ్రహములు నిష్ప్రయోజనములు; తామే అందుకు సాక్షులు, వారు గ్రహించువారు కారు, ఎరుగువారు కారు, గనుక వారు సిగ్గుపడరు. ఎందుకును పనికిరాని విగ్రహమును పోతపోసి దాని నొక దేవునిగా నిరూపించువాడెవడు? ఇదిగో దాని పూజించువారందరు సిగ్గుపడుదురు ఆ శిల్పకారులు నరమాత్రులే గదా? వారందరు పోగుచేయబడి నిలువబడవలెను నిశ్చయముగా వారు భయపడి సిగ్గుపడుదురు.

దీనికి ముందటి పేరాగ్రాపులో వర్ణింపబడినట్లు దైవీకమైన ప్రథమ ప్రయత్నమునకు తారతమ్యముగా, ఈ సందర్భములో చేయబడాల్సిన ప్రథమ ప్రయత్నము (9–11 వచనాలు). ఇప్పుడు మానవులకు విడువబడియున్నది. “నిష్ప్రయోజనము” (*tohu*) అను పదము గందరగోళము, అవాస్తవము, లేక శూన్యము అను అభిప్రాయమును తెలియజేయుచున్నది.[5] దేవుని సృష్టి కార్యకలాపమునకు మునుపు అస్తవ్యస్తమైయుండిన పరిస్థితిని వర్ణించుటకు మొట్టమొదటిసారి ఆదికాండము 1:2లో వాడబడిన ఈ పదము, పాత నిబంధనలోని ఇతర గ్రంథములలో కంటే యెషయా గ్రంథంలో అతి తరుచుగా కనిపించుచుండును.[6] “విగ్రహములు చేయువారందరును నిష్ప్రయోజకులై యున్నారు, మరియు అవి వారి ధనాగారమని ఎంచువారు నిరర్థకమైనవారేయను భావము NIV అనువాదములో వ్యక్తము గావింపబడియున్నది (9ఎ వచనం).

లోకములో విగ్రహములకు ఒక అర్థముగాని ఒక ఉద్దేశముగాని లేదని వాటిని చేయువారికి ఎటువంటి అవగాహనయైనను లేదు (10, 11 వచనాలు). ఆ దేవుడు వారికేమైయుండవలెనని వారి మస్సులో యుండెనో అట్టి ఆలోచనతో ఒక దేవున్ని చేయాలని వారు ప్రయత్నించారు.[7] వారికి తమ చేతి పనిలోగల నిపుణతనుబట్టి అతశయించుటకు బదులుగా, “వారు సిగ్గుపడుదురు” అని ప్రవక్త పలుకుచున్నాడు (9, 11 వచనాలు).

### విగ్రహము చెట్టు నుండి తీసికొనబడిన ఒక కర్ర మాత్రమే! (44:12–17)

> కమ్మరి గొడ్డలి పదును చేయుచు నిప్పులతో పనిచేయును
> సుత్తెతో దానిని రూపించి తన బాహుబలముచేత దాని చేయును
> అతడు ఆకలిగొనగా అతని బలము క్షీణించిపోవును
> నీళ్లు త్రాగక సొమ్మసిల్లును
> వడ్లవాడు నూలు వేసి చీర్ణముతో గీత గీచి చిత్రికలతో దాని చక్కచేయును
> కర్కాటకముతో గురుతుపెట్టి దాని రూపించును
> మందిరములో దాని స్థాపింపవలెనని నరరూపముగల
> దానిగాను నరసౌందర్యముగలదానిగాను చేయును.
> ఒకడు దేవదారుచెట్లను నరుకవలెనని పూనుకొనును
> శృశానావృక్షమును గాని సరళవృక్షమును గాని
> సిందూరవృక్షములను గాని అడవి వృక్షములలో ఏదో ఒకదానిని తీసికొనును
> ఒకడు చెట్టు నాటగా వర్షము దాని పెంచును

ఒకడు పొయ్యికట్టెలకు వాటి నుపయోగించును
వాటిలో కొంత తీసికొని చలి కాచుకొనును
నిప్పు రాజబెట్టి రొట్టె కాల్చుకొనును
ఒక తుండు తీసికొని దానితో ఒక దేవతను చేసికొనును
దానికి నమస్కారము చేయును
దానితో ఒక విగ్రహముచేసి దానికి సాగిలపడును.
అగ్నితో సగము కాల్చియున్నాడు, కొదవ
    సగముతో మాంసము వండి భక్షించియన్నాడు
తిని తృప్తిపొందగా చలి కాచుకొనుచు
ఆహా, చలి కాచుకొంటిని వెచ్చగా ఉన్నది అని అనుకొనుచున్నాడు.
దానిలో మిగిలిన భాగముతో తనకు దేవతగానున్న
    విగ్రహమును చేయించుకొనును
దానియెదుట సాగిలపడుచు నమస్కారము చేయుచు
–నీవే నా దేవుడవు నన్ను రక్షింపుమని ప్రార్థించును.

విగ్రహములను చేయుట ఒక తప్పనిసరైనదియు, సత్తువను సంపూర్తిగా క్షీణింపజేయునదైన ప్రక్రియయై యుండెను (12, 13 వచనాలు). కర్రతోగాని లోహముతోగాని విగ్రహములను చేయుటలో అత్యుత్తమ నిపుణులైనవారు ఇట్టి ప్రక్రియలో నిమగ్నులై యుండిరి. ఒక దేవున్ని "నరసౌందర్యముగలవానిగా" రూపొందించుటకు వారు నిర్విరామముగా శ్రమించుచుండిరి. అయితే వారి ప్రయాసకు ఫలితమేమి? పంచభూతములనుండి దానిని కాపాడుటకు కావలసిన గృహము అవసరమైయుండిన మానవాళిని పోలినది మాత్రమే బయటకు వచ్చినది. "మిగతా విషయములన్నిటిని మించి, నిత్య సత్యమును మానవాళి రూపములో పోతపోయుటకు చేయబడిన ఒక ప్రయత్నమై యుండినది."[8] నేడు మనముందున్న గంభీరమైన ప్రశ్న ఏమనగా, "దేవున్ని మన పోలిక చొప్పున చేయుటకు మనము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నామా?" మానవతా వాదము ఈ ప్రశ్నకు "ఔను" అనే సమాధానమిస్తుంది!

ఈ పరిస్థితిలోగల అంతిమ వ్యంగ్యమును యెషయా ప్రదర్శించాడు (14–17 వచనాలు). తననుతాను చలికాచుకొనుటకును వంట సిద్ధము చేసికొనుటకును సగము మ్రానును, మిగిలిన సగమును ఆరాధించుటకును పూజించుటకును ఉద్దేశింపబడిన ఒక వస్తువును తయారు చేయుటకును ఎవరైనా గాని ఎలా తీసికొనగలరు? ఇటువంటి నిర్జీవ వస్తువు ఏమి విడుదల నివ్వగలుగుతుంది? ఏమీ ఇవ్వలేదు!

## విగ్రహారాధికుడు మోసపోతున్నాడు! (44:18–20)

వారు వివేచింపరు గ్రహింపరు
చూడకుండునట్లు వారి కన్నులు కప్పబడెను
గ్రహింపకుండునట్లు వారి హృదయములు మూయబడెను
ఎవడును ఆలోచనచేయడు, నేను అగ్నిలో సగము కాల్చితిని
నిప్పులమీద వేసి రొట్టె కాల్చితిని
దానితో మాంసము వండుకొని భోజనము చేసితిని
మిగిలినదానిని తీసికొని దానితో హేయమైనదాని
    చేయుదునా?

చెట్టు మొద్దుకు సాష్టాంగపడుదునా? అని యెవడును ఆలోచింపడు
యోచించుటకు ఎవనికిని తెలివిలేదు వివేచనలేదు.
వాడు బూడిదె తినుచున్నాడు, వాని మనస్సు
    మోసపోయినదై తప్పుదారిని వాని తీసికొనిపోవుచున్నది
వాడు తన ఆత్మను రక్షించుకొనజాలడనియు
నా కుడిచేతిలో అబద్ధమున్నది గదా అనియు అనుకొనుటకు
    వానికి బుద్ధి చాలదు.

"వారికి తెలియదు, సరికదా వారు గ్రహించరు" అని విగ్రహములను ఆరాధించువారి గూర్చి యెషయా చెప్పుచున్నాడు. దేవుని గూర్చిన తెలివిలేకుండుట వలననే ప్రజలు యిలా నాశమగుచున్నారనియు, దేశబహిష్కరణ గావింపబడుచున్నారనియు యెషయా మరియు హోషేయ ధ్రువీకరించారు (యెషయా 5:13; హోషేయ 4:6). అది దేవుని పొరపాటు కాదు, కానీ దేవుడైన యెహోవా తప్ప వేరొక దేవుడు లేడను యథార్థ సత్యమునకు అంధులై మూర్ఖపు పట్టుదలగల ప్రజల బాధ్యతయై యుండినది.

వారు వంట చేయుటకు ఉపయోగించు అదే "కర్ర తుండును" ఉపయోగించి "ఒక హేయమైన వస్తువును" రూపొందించు పనులలో గల హేతువిరుద్ధమైన విషయము గూర్చి కొంచెమైనా యోచింపలేదు (19 వచనం). "విగ్రహము" అను మాటకు బదులుగా యెషయా "హేయమైనది" అను మాటను ఎందుకు ఉపయోగించాడు? ఎందుకనగా పూజించువారు ఒక "కర్ర తుండుతో" వాస్తవంగా తయారుచేసినది హేయమైనదే. ఈనాడు, మనము మన జీవితమునకు గల అర్థమును మరియు జీవిత (అంతిమ) గమ్యమును మనము ఒకే నిజమైన దేవునిలో బదులుగా ఐహిక వస్తువులలో కనుగొనవచ్చని కొందరు స్వాధికారంతో చెప్పుదురు, కానీ అది శుద్ధ అబద్ధము. ఇటువంటి విషయాల వెంటబడుట కేవలము శూన్యమైనదనియు అర్థరహితమైనదియు తెలిసికొనుటకు ఒకరు ప్రసంగి గ్రంథంలోని మొదటి అధ్యాయాలు చదివినట్లయితే అంతా చక్కగా అర్థమవుతుంది.

విగ్రహారాధికుడు "బూడిదె తినుచున్నాడు; వాని మనస్సు మోసపోయినదై తప్పుదారిని వాని తిసికొనిపోవుచున్నది" (20 వచనం). విగ్రహారాధికుని మూర్ఖత్వము యొక్క ఫలితమును Burton Coffman ముక్తసరిగా యిలా తెలియజేయుచున్నాడు:

> మానవులకు ఎటువంటి వాస్తవమునైనను ఒక "ప్రతిరూపము" గుర్తుచేయగలదను వివేక శూన్యమైన మనఃకల్పన ఏమనగా: (1) [మానవుడు తన చేతితో చేసికొనిన ఒక వస్తువు] ఆలోచించలేని (ఆట) వస్తువు అనంతమైన అంతఃకరణమై యున్న దేవునిగూర్చి తెలివితేటలు గల మానవునికి ఎలా గుర్తుచేయగలదు? (2) ఉంచబడిన చోటనే కదలకుండ ఉండిపోవు ఒక వస్తువు సర్వవ్యాపియైయున్న వాని గూర్చి తెలివితేటలుగల వానికి ఎలా గుర్తుచేయగలదు? (3) బొత్తిగా ఎటువంటి బలముగాని శక్తిగాని లేని వస్తువు సర్వాధికారియు, సర్వశక్తివంతుడునైన దేవునికి చెందినవానికి ఎలా గుర్తుచేయగలదు? (4) ఒక వస్తువు, అదే తయారుచేయబడి, మెరుగు దిద్దబడి, రంగులు పూయబడి, అలంకరింపబడవలసి యుండగా, సమస్తమును సృష్టించిన సృష్టికర్తయైన దేవుని గూర్చి ఆలోచనాపూర్ణమైనవానికి ఎలా గుర్తుచేయగలదు?[9]

## దేవుని వైభవోపేతమైన విమోచన మరియు విడుదల (44:21-28)

### "ఈ విషయులను జ్ఞాపకముంచుకొనుము" (44:21-23)

అధ్యాయంలోని ఈ భాగము, ఆపత్కాలములో ఆదుకొనవలెనని ఆధారపడగలవాడు ఆయనొక్కడే అని ఇశ్రాయేలు తిరిగి దేవుని యొద్దకు రావలెనని చెప్పుచున్న ఒక పిలుపైయున్నది.

> యాకోబూ, ఇశ్రాయేలూ; వీటిని జ్ఞాపకము చేసికొనుము
> నీవు నా సేవకుడవు నేను నిన్ను నిర్మించితిని
> ఇశ్రాయేలూ, నీవు నాకు సేవకుడవై యున్నావు నేను నిన్ను మరచిపోజాలను.
> మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను
> మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచివేసి యున్నాను
> నేను నిన్ను విమోచించియున్నాను, నాయొద్దకు మళ్లుకొనుము.
> యెహోవా ఆ కార్యమును సమాప్తి చేసియున్నాడు
> ఆకాశములారా, ఉత్సాహధ్వని చేయుడి
> భూమి అగాధస్థలములారా, ఆర్భాటము చేయుడి
> పర్వతములారా, అరణ్యమా, అందులోని ప్రతి వృక్షమా, సంగీతనాదము చేయుడి.
> యెహోవా యాకోబును విమోచించును
> ఆయన ఇశ్రాయేలులో తన్నుతాను మహిమోన్నతునిగా కనుపరచుకొనును.

"వీటిని జ్ఞాపకముంచుకొనుము" (21 వచనం) అను మాటలు యెరికోకు ఎదురుగా నుండిన, మోయాబు మైదానములో మోషే ఇశ్రాయేలుకు ఇచ్చిన వీడ్కోలు ఉపన్యాసములను మనకు గుర్తుచేయుచున్నవి.[10] సేవకుని జీవితము దేవుడు తన ప్రజల పక్షముగా చేసిన శక్తివంతమైన కార్యముల గూర్చిన యోచనపై నిర్మింపబడవలెను. సరైన సేవాతత్వము ఆరాధన, మరియు స్తుతి నిమిత్తము ఇదే మూలాధారమైనదై యున్నది. ఈ విషయమునకు పరిపూర్ణ ఉదాహరణమైయున్న యేసు, "మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచనా క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను" అని చెప్పాడు (మార్కు 10:45).

మనము ఇంతవరకు ఈ అధ్యాయంలోని ప్రారంభ నిశ్చయార్థకములన్నిటిని సవిస్తరంగా ఆలోచించాము. దేవుడు "నీ అతిక్రమములను ... నీ పాపములను తుడిచివేసి ... నిన్ను విమోచించియున్నాడు" అను అభయము అనుగ్రహింపబడినది (22 వచనం). గ్రంథంలోని అసలు విషయము ఇదే, మరియు మిగిలిన అధ్యాయాలు సంపూర్ణ సహకారము నిచ్చుచున్నవి.

విమోచనా ఆలోచననుబట్టి "ఉత్సాహధ్వని" చేయవలెనని ప్రవక్త పిలుపు నిచ్చాడు (23 వచనం). కేవలము విగ్రహములైయున్న దేవుళ్ల ఓటమి పాలయ్యాయనునదే సంతోషకరమైన వర్తమానము కాదు. కానీ దేవుడు చరిత్రలో విమోచనము కలుగజేయు విధంగా తన కార్యకలాపమును కొనసాగించుచున్నాడు.[11] దేవుడు విమోచనము కలుగజేయు తన కార్యమును నెరవేర్చుట ద్వారా "తన మహిమను కనుపరచుకొనుచున్నాడు." ఇశ్రాయేలీయుల నిర్గమము సమయంలో దేవుడు చేసిన శక్తివంతమైన కార్యముల ద్వారా ఆయన మహిమ

విదితమై యుండినది (నిర్గమకాండము 16:10; 40:34; ద్వితీయోపదేశకాండము 5:24). ప్రజలు విగ్రహారాధికులై యుండినందువలన దేవుని మహిమ దేవాలయములో నుండియు యెరూషలేము పట్టణములో నుండియు వెడలిపోయినదని బబులోనుకు చెరగా కొనిపోబడు స్వల్ప సమయమునకు ముందు, ప్రవక్తయైన యెహెజ్కేలు, స్పష్టముగా వర్ణించాడు (10:4, 18; 11:23).[12]

## విడుదల చేయువాడైన కోరెషు (44:24-28)

గర్భమునుండి నిన్ను నిర్మించిన నీ విమోచకుడగు
    యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
–యెహోవానగు నేనే సమస్తమును జరిగించువాడను
నేనొకడనే ఆకాశమును విశాలపరచినవాడను
నేనే భూమిని పరచినవాడను
నేనే ప్రగల్భుల ప్రవచనములను వ్యర్థము చేయువాడను
సోదెకాండ్రను వెఱ్ఱివారినిగా చేయువాడను
జ్ఞానులను వెనుకకు త్రిప్పి వారి విద్యను అవిద్యగా చేయువాడను నేనే.
నేనే నా సేవకుని మాట రూఢిపరచువాడను
నా దూతల ఆలోచన నెరవేర్చువాడను
–యెరూషలేము నివాసస్థలమగుననియు
యూదా నగరులనుగూర్చి అవి కట్టబడుననియు
నేను ఆజ్ఞ ఇచ్చియున్నాను, దాని పాడైన స్థలములను బాగుచేయువాడను నేనే.
నేనే నీ నదులను ఎండచేయుచున్నాను ఎండిపొమ్మని ప్రవాహముతో నేనే చెప్పుచున్నాను
కోరెషుతో – నా మందకాపరీ, నా చిత్తమంతయు నెరవేర్చువాడా, అని చెప్పువాడను నేనే.
యెరూషలేముతో – నీవు కట్టబడుదువనియు దేవాలయమునకు
    పునాదివేయబడుననియు నేను చెప్పుచున్నాను.

24 నుండి 27 వచనములు కార్యములుచేయు దేవున్ని చిత్రీకరించుచున్నవి. దేవుని శక్తివంతమైన కార్యములు నలుదిక్కుల కనిపించే విశాల దృశ్యము ఇవ్వబడియున్నది. ఇశ్రాయేలునకు ఆయన సృష్టికర్త, జీవనాధారము, కాపుకర్త మరియు విమోచకుడునైయుండెను.

దేవుడు ఒక గంభీరమైన ప్రకటన చేసాడు: “కోరెషుతో, ‘నా మందకాపరీ నా చిత్తమంతయు నెరవేర్చువాడా’ అని చెప్పువాడను నేనే” (28 వచనం). ఇక్కడ 41:2, 3, 25లో సందర్భానుసారంగా పేర్కొనబడిన అనామిక విజేతకు, చెప్పబడిన సంఘటన జరుగుటకు ఒకటిన్నర శతాబ్దము క్రిందట, ఒక పేరు పెట్టబడినది. గనుక 40-66 అధ్యాయాలు యెషయా చేత వ్రాయబడినవని ఆలోచించుటకు బదులుగా, అవి. క్రీ.పూ. ఆరవ శతాబ్దములో వ్రాయబడినవని అనేక ఆధునాతన వేదాంత పండితులు చెప్పుటకు గల ముఖ్య కారణములలో ఇదొకటై యున్నది. ఇంత గొప్ప సవివరమైన ప్రవచనము కోరెషు బబులోనుకు[13] విరోధముగా తన విజయవంతమైన ఉద్యమములను మొదలపెట్టిన తరువాత వ్రాయబడియుండునని వారు పట్టుబట్టుదురు.[14] ఏదిఏమైనా, సాధికార పండితులు

ఈ అధ్యాయాలు యెషయా చేత వ్రాయబడినవే అని ధ్రువీకరించుచు, బలమైన, ఒకరిని ఒప్పింపజేయు ఖండనములు చేసారు. Homer Hailey యిలా చెప్పుచున్నాడు,

> సంభవింపనై యుండిన సంఘటన గూర్చి 150 సంవత్సరములకు మునుపే ప్రకటించుటకు అవసరమై యుండు ప్రేరేపణ, అది సంభవింపనైయుండిన ఆరు మాసములకు ముందు ప్రకటించుటకు అవసరమైయుండు ప్రేరేపణ కంటే గొప్పదై యుండును. ప్రవచనము పలుకబడునప్పుడు కోరెషు అదివరకే బబులోను దేశమును కైవశము చేసికొని యున్నప్పటికిని, యూదులు తిరిగి వచ్చుటకును యెరూషలేము పట్టణము పునఃనిర్మింపబడుటకును ఆయన అనుమతించునని ఒకరికి ఎలా తెలుస్తుంది?[15]

---

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 342. [2]Donald J. Wiseman, in *Theological Wordbook of the Old Testament,* ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980), 1:418. [3]Clyde M. Woods, *People's Old Testament Notes: Isaiah* (Henderson, Tenn.: Woods Publications, 2002), 194. [4]యోవేలు 2:28-32; అపొస్తలుల కార్యములు 2:16-21. [5]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1972), 1062. [6]యెషయా 40:17, 23; 41:29; 45:18, 19; 49:4; 59:4లో ఇదే హీబ్రూ పదము వాడబడియున్నది. అది "అస్తవ్యస్తము," "అర్థరహితము." "నిరాశ" "శూన్యము," మరియు "ఒక వ్యర్థమైన స్థలము" అని కూడ అనువదింపబడియున్నది. [7]Motyer, 345. [8]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 180-81. [9]James Burton Coffman and Thelma B. Coffman, *Commentary on Isaiah*, James Burton Coffman Commentaries, The Major Prophets, vol. 1 (Abilene, Tex.: ACU Press, 1990), 420. [10]ద్వితీయోపదేశకాండము 5:15; 7:18; 8:2, 18; 9:7, 27; 32:7.

[11]Oswalt, 191. [12]Denny Petrillo, *Ezekiel*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2004), 151-52. [13]John T. Willis, *Isaiah*, The Living Word Commentary on the Old Testament (Abilene, Tex.: ACU Press, 1980), 381; John D. W. Watts, *Isaiah 34-66*, Word Biblical Commentary (Waco, Tex.: Word Books, 1985), 147; John Goldingay, *Isaiah*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2001), 222. [14]Motyer, 355-56; Oswalt, 196; Woods, 199. [15]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 377.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ విగ్రహాలతో వచ్చిన విషాదాంతము ❖❖❖
### (44వ అధ్యాయం)

ఒక విధంగా చూచినట్లయితే, యెహోవాకు ప్రత్యర్థులు లేరు. ఎందుచేతనంటే వేరొక దేవుళ్లు లేరు: దేవుడు మాత్రమే నిజమైన మరియు సజీవుడైయున్న దేవుడై యున్నాడు. ఎవరైనా

ఒకరు కఱ్ఱతోగాని రాతితోగాని చేయబడిన దేవుని యెదుట వంగి నమస్కరించుట కంటే భూలోకమందు దీనిని మించిన విషాదపూరితమైన విషయం మరొకటి లేదు. ఇటువంటివారు ఒక అసత్యమును నమ్ముటయేగాక దానిని పూజిస్తున్నారు కూడ.

*మరొక దేవుని పూజించువాడు తన సమయాన్ని వృథాచేసికొనుచున్నాడు.* అతడు అభావమైనది ఉన్నదని కల్పించుకొనుచు దానిని ఆరాధించుచున్నాడు. ఇంతకు మించి నిరర్థకమైనది మరొకటుండదు. "విగ్రహమును నిర్మించువారందరు మాయవంటివారు. వారికిష్టమైన విగ్రహములు నిష్ప్రయోజనములు ..." (9 వచనం).

మరొక దేవుని పూజించువాడు వాని చేతులు వాని మనఃకల్పన చొప్పున చేసినదానినే పూజించుచున్నాడు. నాజూకైన మానవుడు ఒక దేవుని చేసికొన్నాడు, కాని వాడు చేసుకొన్న దేవుడు వానికంటే బలహీనుడైయున్నాడు. ఒకడు కొంత ఇనుమును తీసికొని, గుణ్టపు లాడమును లేక ఒక నాగలిని తయరుచేసినట్లుగానే, అది అతడనుకొన్న ఒక దేవుని రూపములోనికి వచ్చువరకు దానిని బాదుచూ ఒక దేవున్ని తయారు చేసికొనవచ్చును. మరొకడు వాని దేవున్ని కఱ్ఱతో చేసికొనవచ్చును. అతడు చలికాచుకొనుటకుగాని కుటుంబము కొరకు భోజనమును వండుటకు గాని వంటచెరుకుగా ఉపయోగించుకొను అదే కఱ్ఱతో తన దేవున్నికూడా రూపొందించుకొనుచున్నాడు (12–17 వచనాలు). అతడు తన దేవున్ని తన చేతులతో పైకెత్తి పట్టుకొనవలసి యుండును; ఏలయనగా వాని దేవుడు తనను తాను పైకెత్తి పట్టుకొని యుంచుకొనగలుగుటకు అవసరమైన జీవము లేనివాడైయున్నాడు.

*మరొక దేవున్ని ఆరాధించువాడు ఆలోచన చేయలేని, మాట్లాడలేని, లేక చలనములేని ఒక వస్తువును ఆరాధించుచున్నాడు.* అది నిర్జీవమైనది మరియు నిష్ప్రయోజనమైనది. "వారు వివేచింపరు, గ్రహింపరు, చూడకుండునట్లు వారి కన్నులు కప్పబడుటను గ్రహింపకుండునట్లు వారి హృదయములు మూయబడెను" (18 వచనం).

*మరొక దేవున్ని పూజించువాడు ఎట్టకేలకు చివరకు చికాకుపడిపోవును.* ఇప్పుడుగాక అటుతరువాత అయినా, ఎప్పుడో ఒకప్పుడు, ఉన్నాడని అతడనుకొనుచున్న దేవునికి అసలు ఉనికే లేదను కనువిప్పును అతడు అనుకూలపర్చుకొనవలసి యుండును. "ఇదిగో, దాని పూజించువారందరును సిగ్గుపడుదురు, ఆ శిల్పకారులు నరమాత్రులేగదా? వారందరును పోగుచేయబడి, నిలవబడవలెను, నిశ్చయముగా వారు భయపడి, సిగ్గుపడుదురు" (11 వచనం).

విగ్రహముల గూర్చిన ఈ వాస్తవములు ఎందుకు ఇంత ప్రాముఖ్యమైనవైయున్నవి? నిర్జీవమైన ఈ విగ్రహములకును సజీవుడై సత్యవంతుడునై యున్న దేవునికిని మధ్య మన మనస్సుల్లో గల వైషమ్యము తేర్చబడవలెను. "యాకోబు, ఇశ్రాయేలూ, వీటిని జ్ఞాపకము చేసికొనుము, నీవు నా సేవకుడవు; నేను నిన్ను నిర్మించితిని, ఇశ్రాయేలూ, నీవు నాకు సేవకుడవై యున్నావు, నేను నిన్ను మరచిపోజాలను" (21 వచనం). మన దేవుడు ఈ అసత్య దేవుళ్ళవంటివాడు కాదు; ఆయన సజీవుడు, చైతన్యవంతుడు, మరియు నిత్యుడు. ఇశ్రాయేలు దేశమును మరియు క్రొత్త నిబంధన సంఘమును తీర్చిదిద్దినవాడు ఆయనే. ఆయన మన పాపమును క్షమించి మనకు విమోచనము కలుగజేస్తాడను వాస్తవమును మనము నమ్మవచ్చును.

మన మనస్సును లగ్నముచేసి సత్య దేవుని గూర్చి సుదీర్ఘంగా ఆలోచన చేయుట

వలన నీ ఆత్మకు అవధులులేని ఆనందము కలుగును: “యెహోవా ఆ కార్యమును సమాప్తి చేసియున్నాడు! ఆకాశములురా, ఉత్సాహధ్వని చేయుడి, భూమి అగాధస్థలములారా, ఆర్భాటము చేయుడి; పర్వతములారా, అరణ్యమా, అందులోని ప్రతి వృక్షమా, సంగీత నాదము చేయుడి; యెహోవా యాకోబును విమోచించును, ఆయన ఇశ్రాయేలులో తన్నుతాను మహిమోన్నతునిగా కనుపరచుకొనును” (23 వచనం).